

యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నైపుణ్య రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 10వ తరగతి, ఐటిఐ, డిప్లమో కలిగిన విద్యార్థులకు పాడేరు పాలిటెక్నికల్ కళాశాలలో ద్విచక్ర వాహనాల సర్వీస్ టెక్నిషియన్ రంగంలో మూడు నెలలు ఉచిత శిక్షణ అందించి అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణా కాలంలో బస్పాస్ సౌకర్యం కల్పిస్తారన్నారు. డిగ్రీ విద్యార్థతలకు అరకు వ్యాలీ యూత్ శిక్షణా కేంద్రంలో హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ అవుట్లెట్ మేనేజర్ రంగాలలో శిక్షణ ఇస్తామన్నారు. హౌస్ కీపింగ్‌లో 6 నెలలు, ఫుడ్ అవుట్లెట్ విభాగంలో లో 5 నెలల శిక్షణ అందిస్తారని, వీరికి శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. అర్హులైన యువతీ యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు పి.నవీన్ కుమార్‌ను ఫోన్: 9491786463 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గిరిజనులకు నష్టాన్ని కలిగించే...

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దుకు ఉద్యమం

- బోగి మంటల్లో ప్రాజెక్ట్ అనుమతి పత్రాలు దగ్ధం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: గిరిజనులకు నష్టాన్ని కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ఉద్యమం ఉధృతం చేస్తామని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస తెలిపారు. అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా విస్తత కార్యకర్తల సమావేశం రెండు రోజుల పాటు నిర్వమించారు. ఈ సందర్భంగా అప్పలనరస మాట్లాడుతూ, అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రెగులపాలెం, చిట్టెంపాడు, గుజ్జిలి, చింతపల్లి మండలం ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. సిపిఎం ప్రతినిధి బృందం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న అటవీ ప్రాంతాన్ని, గ్రామాలను ఇప్పటికే పర్యటించిందన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను ధిక్కరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి ఇచ్చిన హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పై గిరిజనులు ఉద్యమం చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థలైన అదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి మంజూరు చేయడం తమ రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. సెల్ ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తామని మాయమాటలు గిరిజనులకు చెప్పి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి డ్రోన్‌లతో సర్వే నిర్వహించడం ఎంతవరకు సబబని ప్రశ్నించ్చారు.అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం పంచాయతీ గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి తీర్మానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఆధాని కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు కేటాయించడాన్ని గిరిజనులు వ్యతిరేకించాలన్నారు. 1997లో నిమ్మలపాడు మైనింగ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పును దిక్కరించడం తగదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించలేని ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితులను ఆదుకుంటామని, ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పడం దారుణ మన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నివేదికను రూపొందించడం సరికాదన్నారు. ప్రాజెక్టుల పేరుతో కార్పొరేట్ సంస్థలకు గిరిజనుల భూములు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతి రద్దు చేయాలని ఈనెల 11న మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అనంతగిరి జెడ్పిటిసి ధీసరి గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్పీ పోతురాజు, బొండ సన్నిబాబు, జయ, రామారావు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనర్స



మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి

- జిల్లా మలేరియా నివారణ అధికారి సాంబమూర్తి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గున్యా వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని జిల్లా మలేరియా అధికారి డి.సాంబమూర్తి సూచించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సచివాలయం-2 పరిధిలోని పాత పాడేరులో డ్రై డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిల్వ నీటిలో వ్యాధులను కలగజేసే క్రిములు వృద్ధి చెందుతాయని, ప్రతి శుక్రవారం పాత్రను శుభ్రం చేసుకొని డ్రై డే పాటించాలని సూచించారు. ఎక్కువకాలం నిల్వ ఉన్న నీటిలో పెరిగే దోమలు, క్రిముల ద్వారా వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఖాళీ స్థలాల్లో, ఇళ్లల్లో, పనికిరాని వస్తువుల్లో రోజుల తరబడి నీరు నిలువ చేయకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటిని నిలువ చేసే పాత్రలు, డ్రమ్ములు, తొట్టెల్లో నీరు తొలగించాలని, వ్యర్థాలను కాలువలు, ఖాళీ స్థలాల్లో వేయకుండా పరిసరాలు పరిశుభ్రత పాటిస్తూ దోమతెరలను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి కె.శేషయ్య, జిల్లా కన్సల్టెంట్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి బి.ధనంజయ్, ఎంపిటిసి వి.చిట్టమ్మ, పంచాయితీ కార్యదర్శి విజయ్, హెల్త్‌అసిస్టెంట్ బి.ఎలీషారావు, ఎఎన్ఎం ఎం.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



డొంకరాయి పవర్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి పవర్ కెనాల్‌కు నీరు విడుదల

- దాదాపుగా పూర్తయిన మరమ్మతు పనులు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్‌కు శుక్రవారం టెస్టింగ్ నిమిత్తం డొంకరాయి శాడిల్ డ్యాం స్లూయిస్ గేట్లు ద్వారా నీటిని విడుదల చేసినట్లు ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. పవర్ కెనాల్ గండి మరమ్మతు పనుల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా? లేవా అనే కోణంలో కెనాల్ పనితీరు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డొంకరాయి పవర్ కెనాల్ కాంక్రీట్ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయని చెప్పారు. పవర్ కెనాల్ గండి మరమ్మతు పనుల్లో భాగంగా ముందుగా కెనాల్‌లో వైపు కాంక్రీట్ పనులు కొద్ది రోజులు క్రితం పూర్తయ్యాయని, బయటి వైపు కాంక్రీట్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. మిగిలిన కొద్దిపాటి గండి మరమ్మతు పనులు పూర్తి చేయడానికి చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు.

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఒక యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించామని, రాత్రికి మరో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని మోతుగూడెం ఈఈ బాలకృష్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్‌కు గత నెల 14 అర్ధరాత్రి గండి పడిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. నాటి నుండి డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని తెలిపారు. శుక్రవారం పవర్ కెనాల్ నుంచి టెస్టింగ్ నిమిత్తం నీటిని విడుదల చేయడంతో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి, 1.5 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశామని వెల్లడించారు. కెనాల్‌లో నీటి విడుదలను బట్టి గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం డొంకరాయి జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదని తెలిపారు.

స్పందనకు 76 వినతులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఐటిడిఎలో అంబేద్కర్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 76 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి జె.శివశ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూమి వివాదాలు, రహదారి సదుపాయాలు, తాగునీటి సమస్యలు, ఉపాధి అవకాశాల కోసం అధికంగా వినతులు సమర్పించారు. జి.కె.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ చుట్టిగొంది గ్రామస్తులు కె.గుండన్న, పి.ప్రసాద్, కె.త్రినాద్ గ్రామంలో 20 కుటుంబాలు జీవిస్తున్నాయని, మంచినీటి సదుపాయం కల్పించాలని వినతి పత్రం అందజేసారు. క ొ య ు ా ్య ర ం ు మండలం వెలగలపాలెం గ్రామంలో శిధిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనం, కమ్యూనిటీ భవనం శిధిలాలను తొలగింపు పనులు చేసానని, పంచాయతీ నుండి డబ్బులు ఇప్పించాలని ఎస్.గంగా పవన్ వినతి పత్రంలో కోరారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ పోయిపల్లి గ్రామస్తులు పి.అచ్చన్న, మర్రి రాజారావు, పాంగి అప్పులమ్మ తదితరులు తాగునీటి సదుపాయం, సిసి రోడ్లు నిర్మించాలని కోరారు. పాడేరు మండలం వర్తనాపల్లి పంచాయతీకి చెందిన సరమండి శుభలక్ష్మి తన తండ్రి బాలన్న సీడిగొంది గ్రామంలో 30 ఏళ్ల నుండి సాగు చేస్తున్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం పాత పాడేరు గ్రామానికి చెందిన కొర్రా కాంతమ్మ ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీని అందజేసారు. అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ దాయర్తి గ్రామానికి సిసిడిపి కింద డిఆర్‌డిపో, అంగన్వాడీ భవనం మంజూరు చేసారని సకాలంలో పూర్తి చేయాలని కోరారు. నాడు నేడు కింద మంజూరైన పాఠశాల భవన నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, డిఎంఅండ్‌హెచ్ఒ జమాల్ భాషా, ఎడిఎం అండ్ హెచ్ఒ లీలాప్రసాద్, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్ఎం రాజు, పిఆర్ ఇఇలు కె.లావణ్యకుమార్, కొండయ్య పడాల్, డిఇఒ పి.రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలాక్రిష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ


పాడేరు జర్నలిస్ట్ ఫోరం ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో జర్నలిస్టులు నూతనంగా పాడేరు జర్నలిస్ట్ ఫోరం(పిజెఎఫ్)ను ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవన్ లో శుక్రవారం పట్టణంలో సీనియర్ పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసుకుని పాడేరు జర్నలిస్ట్ ఫారం ఆవిర్భావాన్ని ప్రకటించారు. ప్రింట్ మీడియా తరఫున వార్త స్టాఫ్ రిపోర్టర్ పి.సత్యనారాయణను కన్వీనర్‌గాను, ఎలక్ట్రానిక్ మీడియా తరపున కన్వీనర్‌గా టీవీ5 రిపోర్టర్ చక్రవర్తిని ఎన్నుకున్నారు. పాడేరు పట్టణం నుంచి ప్రముఖ దినపత్రికలకు టీవీ చానల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న 18 మంది రిపోర్టర్లతో పిజెఎఫ్‌ను ఏర్పాటు చేశారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నేడు సుబ్బారావు వర్థంతి



ప్రజాశక్తి-కూనవరం : సిపిఎం తొలి తరం నాయకుడు, కూనవరం మాజీ సర్పంచ్ కామ్రేడ్ గర్నేటి సుబ్బారావు 8వ వర్థంతి కార్యక్రమం శనివారం మండల కేంద్రంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి పాయం సీత రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామ్రేడ్ సుబ్బారావు పార్టీకి మూల స్తంభంలా ఉండేవారని పేర్కొన్నారు. శనివారం జరగనున్న వర్థంతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.



జెండాను ఆవిష్కరిస్తున్న మహిళా నాయకురాలు

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఐద్వా 13వ ఆల్ ఇండియా మహాసభను జయప్రదం చేయాలని గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పెదలబుడు పంచాయతీ శరభగుడా, బొండం పంచాయతీ కొత్తవలస, రంగినీవలస, రేగాలో జెండాలను ఆవిష్కరణ చేశారు. ఈనెల 6, 7, 8, 9వ తేదీలో ఆల్ ఇండియా మహాసభ కేరళ రాష్ట్రంలో తిరువనంతపురంలో జరుగుతాయని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తారని తెలిపారు. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుని పార్లమెంట్లో ఆమోదం పెట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం వెంటనే 33శాతం బిల్లును ఆమోదించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ శశికళ, రాధా, లక్ష్మి, సుందరమ్మ, కళా, సుశీల, నాగమ్మ పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి: గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించి, పశువుల. మేకలపై పులుల దాడి నుండి రక్షణ కల్పించాలని మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగ, చిన్న కోనేల గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల అప్పాలరాజు, గ్రామస్థుడు భూరిగ .పెంటయ్య లు మాట్లాడుతూ, భూరిగ, చిన్నకోన్నేల గ్రామాల్లో కనీసం రోడ్డు, విద్యుత్, వంటి సదుపాయాలు లేవన్నారు. రెండు గ్రామాలలో 270 మంది నివసిస్తున్నారని, విద్యుత్ లేక పోవడంతో రాత్రి వేళలో పులులు సంచరిస్తునాయని, ఇప్పటికే మూడు ఆవులను హతమార్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాత్రి వేళలో బయటకు రావాలంటే బిక్కు బిక్కు మంటు వస్తున్నామన్నారు.ఎస్టేట్ వ్యాపారస్తులు భూ రికార్డులు తారు మారు చేసి భూములను ఖాళీ చేయాలని. తమను బెదిరిస్తున్నారని తెలిపారు. . బురిగ, చిన్న కోనల రెవిన్యూ పరిధిలో 100 ఎకరాలను 80 కుటుంబాల కొండ దొర తెగ ఆదివాసులు దున్నుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. రెవిన్యూ అధికారులు వెబ్ ల్యాండ్ రికార్డులో మార్పు చేసి తమను భూములు ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనపర్తి .సింహాచలం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

గిరిజన ప్రజాప్రతినిధులకు అవమానం

- పింఛన్ల పంపిణీలో ఎంపిపి, స్థానిక సర్పంచ్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వని వైనం
- ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి లక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని ములకలపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గిరిజన ప్రజాప్రతినిధులకు అవమానం జరిగింది. మండల ప్రథమ పౌరురాలైన మండల పరిషత్ అధ్యక్షురాలు కారం లక్ష్మికి, గ్రామ ప్రథమ పౌరురాలైన స్థానిక సర్పంచ్‌కు ఈ కార్యక్రమంలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. అదే సందర్భంలో ప్రజాప్రతినిధులు కాని అధికార పార్టీ నాయకులు రామలింగారెడ్డి, ఇతర నాయకుల చేత మాట్లాడించారు. అధికారిక కార్యక్రమాన్ని వైసిపి నాయకులు రాజకీయ ప్రచార వేదిక మార్చారు. ప్రోటోకాల్ పాటించాల్సిన అధికారులు చోద్యం చూశారు. రాజకీయ నాయకులకు మాట్లాడే అవకాశం ఇచ్చి, ప్రజాప్రతినిధులు, అందులోనూ ప్రథమ పౌరులకు అవకాశం ఇవ్వకుండా అగౌరపర్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష చూపించడంపై వారు మండిపడుతున్నారు. పలు కార్యక్రమాల సందర్భాల్లోనూ ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు చివరి రోజు ఆహ్వానాలు ఇవ్వడం, కొన్నింటికి అసలు ఆహ్వానాలే ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఎంపిపి

ప్రోటోకాల్ పాటించకుండా ప్రజా ప్రతినిధులను అవమానపరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ములకలపల్లి గ్రామంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు వ్యవహరించన తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. కార్యక్రమం అనంతరం రేఖపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ పెద్ద మట్టపల్లి - కుందులూరు రోడ్డు మూడు సంవత్సరాలైనా నిర్మాణం పూర్తి కాలేదని, దాని గురించి పట్టించుకునే నాథడే లేరని తెలిపారు. వరదల కారణంగా సర్వం నష్ట పోయిన బాధితులకు ముఖ్యమంత్రి ఇస్తామన్న నష్టపరిహారం రూ.10వేలు నేటికీ ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోకుండా వరద బాధితులను మోసం చేశారన్నారు. ఈ సమస్యలను ఎక్కడ లేవనెత్తుతారోనని తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఎంపిపి విమర్శించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం సభలు, సమావేశాల్లో మాట్లాడించే అవకాశం ఇచ్చి ప్రజాస్వామ్యం విలువలు కాపాడాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, కారం బుచ్చమ్మ, పులి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి, చిత్రంలో సర్పంచ్‌లు

సీలేరు సర్పంచ్‌గా వల్లి ప్రసాద్

ఉత్తర్వులు జారీ చేసిన డిపిఒ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు పంచాయతీ సర్పంచ్‌గా ప్రస్తుత ఉప సర్పంచ్ కె.వల్లిప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. సీలేరు సర్పంచ్ కె.పరదేశి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994ను అనుసరించి ఉప సర్పంచ్‌ను సర్పంచ్‌గా నియమిస్తూ డిపిఒ జారీ చేసిన ఉత్తర్వులను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ శనివారం వల్లి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వల్లి ప్రసాద్‌కు చెక్ పవర్ కల్పిస్తూ డిపిఒ జారీ చేసిన ధ్రువపత్రాల నకలను సంబంధిత శాఖలకు పంపించినట్లు చెప్పారు. సర్పంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఉప సర్పంచి సర్పంచిగా కొనసాగుతారని డిపిఒ జారీ చేసిన ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నట్లు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.



ప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శి

పెదమట్టపల్లి-కందులూరు రోడ్డు పూర్తి చేసేదెప్పుడు?

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

ప్రజాశక్తి- విఆర్.పురం

మూడేళ్ల నుండి పూర్తి కాని పెద్దమట్టపల్లి-కుందులూరు రోడ్డును ఎప్పుడు పూర్తి చేస్తారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులతో కలిసి సత్యనారాయణ తవ్వి వదిలేసిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సత్యనారాయణ మాట్లాడుతూ పెద్దమట్టపల్లి-కుందులూరు రోడ్డు శంకుస్థాపనకే పరిమితమైందని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే కనీసం పెట్టించుకోలేదని విమర్శించారు. జనం బాధల్లో ఉంటే వాటిని పరిష్కారం చేయకుండా, ఆ సమస్యలపై అధికారిక వేదికల మీద ప్రజాప్రతినిధులు చేతల మాట్లాడించకుండా, పార్టీ మీటింగ్‌ల్లా నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు, శ్రీరామ్మూర్తి, గుండెపూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



తవ్వి వదిలేసిన రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



సిఐ అశోక్‌కుమార్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

సిఐ అశోక్‌కుమార్‌కు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి సిఐ అశోక్ కుమార్ ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. సిఐ విధి నిర్వహణలో ఎంతో ధైర్యసాహసాలతో కీలక కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లా వార్షిక సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదగా సీఐ ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2022లో దారకొండ ఘాట్ రోడ్లో (డకా హిట్ గ్యాంగ్) 11 మంది నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి మూడు ఫెస్టివల్‌లు, కార్లు, బంగారం రికవరీ చేయడంలో సీఐ అశోక్ కుమార్ కీలక పాత్ర పోషించారు. మహారాష్ట్రలో కిడ్నాప్ గురై బందీలుగా ఉన్న ఆరుగురు గిరిజనులకు విముక్తి కల్పించడంలో బహుముఖ పాత్ర పోషించారు. గంజాయి కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, శాంతిభద్రతలు కాపాడడం, మారుమూల గిరిజన గ్రామాలైన రుషికొండ, పాత్రుని గుంటలో రహదారులు నిర్మించడానికి చురుకైన పాత్ర పోషించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో టవర్లు నిర్మాణం, మెడికల్ క్యాంప్, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించడంలో అశోక్ కుమార్ మంచిపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు ఉత్తమ ప్రశంసా పత్రం దక్కింది. సిఐ అశోక్ కుమార్‌కు పలువురు అభినందన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎస్పి శివ కిషోర్, రంపచోడవరం ఏఎస్పి రాణా తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న మహిళా సంఘాల నేతలు

ప్రజాశక్తి -పాడేరు : ఐటీడీఏ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 19వ, రోజు కొనసాగాయి. ఈ రిలే నిరాహార దీక్షలో వివిధ మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు. 19 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్ ఆశ్రమంలో నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక నాయకులు చిన్నారావు, మహిళా సంఘాల నాయకులు కంబిడి లత కుమారి, సుబ్బలక్ష్మి, కెజియ రాణి, లక్ష్మీ బాయి, విమల, స్వరూప,రవణమ్మ, దితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణంపై నోటీసులు



నోటీసులు ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ అరకు రోడ్డు ఆనుకొని శివలింగపురం గ్రామంలో అక్రమ భవన నిర్మాణంపై రెవిన్యూ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా రెండు అంతస్తుల భవనం నిర్మాణాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు తక్షణమే పనులు నిలుపుదల చేయాలని, లేకుంటే రెవెన్యూ చట్టం ప్రకారం కూల్చి వేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

చీరల పంపిణీ



చీరలు ఇస్తున్న ట్రస్ట్ చైర్మన్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట :మండలంలోని తీగలవలస పంచాయతీ కామ్మయ్యపేట, వై.గరడపల్లి, డి.గరడపల్లి గ్రామాల్లో మహిళలకు వైసిపి అరకు పార్లమెంట్ విద్యార్థి విభాగం అధ్యక్షులు, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తేడబరికి సురేష్ కుమార్ శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ దగ్గర కావడంతో నిరుపేద మహిళలకు చీరలను అందజేశామన్నారు. సర్పంచ్ పాంగి బేసి మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ గిరిజనులకు అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామారావు, సచివాలయ కన్వీనర్ దేవరాజు, వార్డ్ మెంబర్ శంకర్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



లబ్ధిదారులకు చెక్కను అందజేస్తున్న కలెక్టర్, పిఒ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఐటిడిఎ ంబేద్కర్ సమావేశ మందిరంలో 158 స్వయం సహాయక సంఘాలకు కోటి 20 లక్షల 66 వేల చెక్కను లబ్ధిదారులకు పంపిణీ చేసారు. తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. ఒక్కొక్క గ్రూపునకు ఎంత లింకేజీ మంజూరైందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. పిఎంఇజిపి కింద రూ.6.60 లక్షల రుణాల చెక్కులు పంపిణీ ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రొగ్రాం పథకంలో ముంచింగిపుట్టు మండల కేంద్రానికి చెందిన ముగ్గురు లబ్దిదారులకు 6 లక్షల 60 వేల చెక్కులను పంపిణీ చేసారు. తాంగుల బాలన్నకు 1 లక్ష 90 వేలు (నిర్మాణ రంగం) మరం లావణ్యకు రూ.2 లక్షల 80 వేలు, (ఆటోమొబైల్ సర్వీసింగ్) తాంగుల విశ్వనాథంకు 1 లక్ష 90 వేలు (వాటర్ సర్వీసింగ్) సేవా రంగాలను నెలకొల్పడానికి రుణాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి జె.శివశ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్‌డిఎ పిడి మురళి, ఎల్ డిఎం రవితేజ, జిల్లా పరిశ్రమ కేంద్రం ఎడి నవీన్ కుమార్, ఎపిఎం ప్రసాద్, మహిళా సంఘాల సభ్యులు లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండల కేంద్రంలో వీధి దీపాలను పునరుద్ధరించాలని అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే.సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలో వీధి దీపాలు లేక పోవడంతో రాత్రి వేళలో అంధకారంలో ఉంటుందన్నారు. చిమ్మ చీకటిగా ఉండటంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

9న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 9న ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు తో పాటు అధికారులు 9న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు:యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ డైరీలను శుక్రవారం పాడేరులో అల్లూరి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జమాల్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి ఎం అండ్ హెచ్ మాట్లాడుతూ, డైరీలో ఆరోగ్య శాఖకు సంబంధించిన విషయాలను పొందు పరచడం అభినందనీ యమన్నారు.ఆశా వర్కర్ కూడా తెలుసుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బందికి ఈ డైరీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణరావు, భూపతి రాజు, మత్స్యరాజు పాల్గొన్నారు.

8న జాతర

ప్రజాశక్తి -అనంతగిరి
మండలంలోని పెద్దకోట పంచాయతీ పరిధి తోంకోటలో బైరమూర్తి పంచ పాండవుల జాతరను ఈనెల 8న ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పొరుగు బొజ్జన్న, కర్రన్నలు ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన సంప్రదాయ ప్రకారం డప్పు, సన్నాయి మేళాలతో దింసా నృత్య కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సొలభంలో గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఐసారం హనుమంతరావు మాట్లాడుతూ. గ్రామసభలో పలు సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ నిధులతో మంజూరైన మంచినీటి బావి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్స్ ,వాలంటరీలు పాల్గొన్నారు

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెఇ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బొయితీలి పంచాయతీ మండీబా గ్రామం నుండి మడత కొండ, పూతికి మెట్ట గ్రామం వరకు మట్టి రోడ్ నిర్మాణ పనులను శుక్రవారం పంచాయతీరాజ్ జేఈ మాణిక్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత దట్టమైన అటవీ ప్రాంతంలో గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసినట్టు ఆయన తెలిపారు స్థానిక సర్పంచ్ మాలన్న, ఎంపీటీసీ అప్పలరాజు పాల్గొన్నారు

పింఛను మంజూరు చేయరూ..

ఆవేదనలో వృద్ధురాలు



పింఛనుకు నోచుకోని పెంటమ్మ

ప్రజాశక్తి పాడేరు :- మండలంలో సలుగు పంచాయితీ ఈదుల పాలెం గ్రామానికి చెందిన గిరిజన పేద వృద్ధురాలు కాకరి పెంటమ్మకు వృద్ధాప్యపు పింఛను అందడం లేదు . ఆమె 1948 జన్మించగా వృద్ధాప్యపు పింఛను మంజూరుకు అన్ని అర్హతలు ఉన్నాయని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు శుక్రవారం విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. పాడేరు మండల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్హత ఉన్న ఆమెకు వెంటనే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయవలసిందిగా సిపిఎం పార్టీ మండల నాయకులు మామిడి రాజారావు, గిరిజన సంఘంజిల్లా అధ్యక్షులు పాలికి లక్కు ఒక ప్రకటనలో కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఎర్రాపాత్రుడు



ఎర్రాపాత్రుడును సత్కరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-అనంతగిరి:ఇన్చార్జి తహశీల్దార్‌గా ఎర్రాపాత్రుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత తహాశీల్దార్‌గా పని చేసిన రామ్‌బాయి తిరిగి విజయవాడ సీఎం క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లడంతో జిల్లా అధికారులు డీటీ ఎర్రాపాత్రునికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను సిబ్బంది సత్కరించారు. అనంతరం ఎర్రాపాత్రుడు మాట్లాడుతూ, గిరిజన ప్రజల భూ సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదబయలు :గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ బైతీన్ లంక, కుంతుర్ల గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి నవరత్నాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గొలుగొండ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ మూడేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని 1 ప్రజలకు వివరించారు.

బాలుర పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - పెదబయలు :స్థానిక గిరిజన బాలుర పాఠశాలలో శుక్రవారం డిప్యూటీ డిఇఒ డిడి కొండలరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ పదవ తరగతి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. స్కూల్ అటెండెన్స్ రికార్డ్స్ తనిఖీ చేశారు ప్రత్యేకంగా 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ముంచింగ్‌పుట్టు, పెదబయలు ఏకలవ్య పాఠశాలల్లో పర్యటించారు. మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రాత్రుల సమయంలో వాచ్ మెన్ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట నోడల్ ప్రిన్సిపల్ పిఎస్ మూర్తి, స్కూల్ ప్రిన్సిపల్స్ డిఎస్ శంకర్‌రావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



కంచె ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు

'గీతం' పరిసరాల్లో ప్రభుత్వ భూమికి కంచె

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)
విశాఖలోని గీతం వర్సిటీ వైద్య కళాశాల పరిసరాల్లో గతంలో గుర్తించిన ప్రభుత్వ భూమి చుట్టూ జివిఎంసి, రెవెన్యూ అధికారులు శుక్రవారం కంచెను ఏర్పాటు చేశారు. కంచె పనులను వేకువజామున భారీ పోలీసు బందోబస్తుతో చేపట్టడంతో తొలుత తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గీతం వైద్య కళాశాల భవనాలను కూలుస్తారనే ప్రచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ నెలకొంది. ఎండాడ, రుషికొండవైపు వెళ్లే మార్గాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మరోవైపు విషయం తెలిసి టిడిపి నాయకులు గీతం వర్సిటీ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆ పార్టీకి చెందిన కొంత మంది నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది. గతంలో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో కంచె ఏర్పాటు చేస్తున్నట్లు భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి పేర్కొనడంతో ఉత్కంఠకు తెరపడింది. ఆ తరువాత కంచె ఏర్పాటు పనులు సజావుగా సాగాయి. పలుచోట్ల ఇది 'ప్రభుత్వ భూమి' అంటూ అధికారులు బోర్డులు పెట్టారు. కళాశాలను ఆనుకుని ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలోనే స్వాధీనం చేసుకున్నామని, ఇప్పుడు కంచె మాత్రమే ఏర్పాటు చేశామని ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

భూ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా చర్యలా : టిడిపి

కలెక్టరేట్ : 'గీతం మెడికల్ కాలేజీ భూ వ్యవహారం కోర్టులో ఉంది. అటువంటప్పుడు ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా ఆ భూమిలో ప్రవేశించి, నిర్మాణాలను తొలగించి పెన్సింగ్ వేయడం సరికాదు' అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న భూమిలో హడావుడి కంచె వేయడం ఏంటని ప్రశ్నించారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రాయల్ ఓక్ ఫర్నీచర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుప్రసిద్ధ ఫర్నీచర్ బ్రాండ్ రాయల్ ఓక్ తమ నూతన స్టోర్‌ను నగరంలోని రామాటాకీస్ రోడ్డులో శుక్రవారం ప్రారంభించింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరయ్యారు. రాయల్ ఓక్ తమ స్టోర్‌ను విశాఖలో ప్రారంభించడం వల్ల ఇక్కడి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రాయల్ ఓక్ ఇంక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ విజయ్ సుబ్రమణియం మాట్లాడుతూ సోఫాలు, రిక్లైనర్స్, డైనింగ్, మ్యాట్రెసస్, బెడ్స్, డెకార్, ఆఫీస్, అవుట్ డోర్ ఫర్నీచర్‌కు తమ సంస్థ పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధన్ సుబ్రమణియం, విశాఖ హెడ్ రాజేష్ పటేల్, ఫ్రాంఛైజీ హెడ్ కిరణ్ ఛాబ్రియా, ఎపి, తెలంగాణ ఫ్రాంఛైజీ హెడ్ ఫణి కుమార్ దాట్ల, కార్పొరేటర్ గొలగాని వీరారావు పాల్గొన్నారు.

లారీల్లో సరుకు లోడు.. వినేదెవరు మా గోడు..

లోడింగ్, అన్‌లోడింగ్ భారం మాపై మోపొద్దు
ప్రభుత్వ అస్పష్ట విధానంతో నష్టపోతున్నాం : ఏపి లారీ ఆపరేటర్ల ఆందోళన
భవిష్యత్తు కార్యాచరణపై ఎగ్జిమ్ పార్కు గేటు వద్ద నేడు సమావేశం



లోడుతో ఉన్న లారీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
రాష్ట్రం, దేశంలో ఎక్కడైనా ప్రజలకు నిత్యావసర సరుకులు సకాలంలో అందుతుండటంలో లారీల పాత్రే కీలకం. ఆకుకూరలు, కాయగూరలు, ఆయిల్‌లు, పప్పులు, ఉప్పులు ఇలా ఒకటేమిటి వందల రకాల ప్రజా వినియోగ సరుకులు, ఉత్పత్తులన్నీ మన దగ్గరకు వచ్చేవి లారీల్లోనే. అయితే, ఈ లారీలు ఎక్కడికక్కడ మొండికేస్తే జనాలకు సరుకులేవీ అందడం సాధ్యపడదు. అలాంటి లారీలను సప్లయ్ చేసే ఆపరేటర్ల సమస్యలపై మాత్రం ప్రభుత్వాలు సానుకూలంగా లేవు. లారీల్లో సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ జరిగే సందర్భాల్లో నియమించుకునే కళాశీల భారాన్ని లారీలపై మోపేలాగ ప్రభుత్వ చర్యలు ఉండడంతో లారీల యజమానులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ నిరసనను తెలియజేసేందుకు శనివారం విశాఖలోని నేవల్ డాక్‌యార్డు, షీలానగర్ రోడ్డులో హెచ్‌పిసిఎల్ నార్త్‌గేట్ ఎదుటగల ఎగ్జిమ్ పార్కు వద్ద ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఎపి లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించడానికి సిద్ధమయ్యారు.

లారీ ఓనర్లు, లారీల సరఫరాదారుల సమస్య ఏమిటి?

ఉత్తరాంధ్రకు చెందిన ఉమ్మడి మూడు జిల్లాల నుంచి కృష్ణా జిల్లా వరకూ సుమారు 500 లారీలను విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సరుకుల ఎగుమతులు, దిగుమతుల కోసం సరఫరా చేస్తుంటారు. ఈ సందర్భంగా లోడింగ్, అన్‌లోడింగ్ చేసేటప్పుడు సరుకు ఓనర్లు అంటే కొనుగోలు, అమ్మకం చేసే వ్యాపారులు కాకుండా లారీలే కళాశీలకు మామూళ్లు ఇచ్చే పరిస్థితి కొనసాగుతోంది. తమకు అంతకంతకూ భారంగా ఉందంటూ లారీ ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆశీలను ఆయా మార్కెట్లను వేలం పాటల్లో దక్కించుకున్న రాజకీయ నాయకులు చెల్లించాలని, ప్రభుత్వం కూడా అలా ఒక జీవో ఇవ్వాలని ఎపి లారీ ఆపరేటర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాపిరాజు 'ప్రజాశక్తి'కి శుక్రవారం తెలిపారు. వేలం పాటలు పాడి రూ.లక్షలు ఆర్జించే రాజకీయ నాయకుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మెతకగా ఉంటూ, మరోవైపు సరుకుల ఓనర్లను కూడా ఆశీలు చెల్లింపులు చేయనివ్వకుండా ప్రభుత్వం చేస్తోందంటూ వారు చెబుతున్నారు.

మొర ఇదీ..

వ్యాపారాలు చేసుకునే వారే ఆశీలు కట్టుకునేలాగ ప్రభుత్వం ఆచరణలో అమలయ్యే ఓ విధానాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌తో తాజాగా ఎపి లారీ ఓనర్లంతా ఏకమవుతున్నారు. విశాఖ జిల్లాలో గాజువాక, విశాఖ నగరం, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరంలలో కళాశీలకు రూ.200 నుంచి రూ.300 వరకూ ఎంతమంది సరుకు దించడం, ఎత్తడంలో పాల్గొంటే అంతమందికీ ఇవ్వాల్సి వస్తుందని వీరు మొరపెట్టుకుంటున్నారు.

ఏటా వేలం పాటలు విరమించాలి

వేలం నిర్వహించడం వల్లే రాజకీయ నాయకులు మార్కెట్లను హస్తగతం చేసుకుని ఆశీలు కూడా కళాశీలకు చెల్లించకుండా వ్యవహరిస్తుండడం పరిపాటి. వేలం నిర్వహించకపోతే ప్రభుత్వానికీ ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. మరోవైపు కళాశీలకు చెల్లింపులు సరుకు లోడింగ్‌లో అమ్మకందారు, అన్‌లోడింగ్‌లో కొనుగోలుదారు చెల్లించేలాగ కోర్టుల ఆదేశాలూ ఉన్నా ప్రభుత్వం అమలు చేయకపోవడం కూడా ఒక లోపంగా ఉంది. లారీల ఓనర్లు కళాశీలకు చెల్లింపులు చేయనవసరం లేదని కోర్టు ఆదేశాలు ఉన్నట్లు సంబంధిత నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పలు మార్కెట్లలో లారీ ఓనర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ వ్యాపారుల మధ్య తలెత్తే వివాదాలు నానాటికీ పెరుగుతున్నాయి. పోలీసుల జోక్యం ఉన్నప్పటికీ లారీల ఆపరేటర్లకు అనుకూలంగా ఉండడం లేదన్నది తెలుస్తోంది. రాజకీయ నాయకులే వేలం పాటలు పాడుకుని మార్కెట్లపై అజమాయిషీ చలాయిస్తున్నందున వీరికి వారి నుంచి ఫోన్ కాల్స్ రావడంతో వీరు ఈ తగాదాల్లో తలదూర్చడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎగ్జిమ్ పార్కు గేటు వద్ద ఎపి లారీ ఆపరేటర్స్, ఓనర్స్, సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరుగనుంది. ఎపి లారీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాపిరాజు, పి.వెంకటరాజు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

విశాఖలో ఆర్గానిక్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
గో ఆధారిత ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుపాటు జరుగనున్న మూడవ విశాఖ ఆర్గానిక్ మేళాను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాలుష్యం విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి పెనుప్రమాదం ఏర్పడుతున్న ప్రస్తుత కాలంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారోత్పత్తులు ప్రజలకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. రైతులు ఆ వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ మాట్లాడుతూ ఇటువంటి ఆర్గానిక్ మేళాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ ఏడాది దేశంలో జరిగే జి - 20 సమ్మిట్‌లో మిల్లెట్స్‌ను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంత స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో ప్రచారం కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎంపీ జివిఎల్.నరసింహారావు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజు

దారకొండలో గ్రామసభ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీలో సర్పంచి నడిగట్ల రాజు అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లు లబ్ధిదారులకు సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దారకొండ పంచాయతీలో కొత్తగా 54 పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో 194 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఒక్కొక్క ఇంటికి రూ.5వేలు చొప్పున ఎకౌంట్లో జమ చేశామని, పునాదుల వరకు కట్టిన తరువాత మరో రూ.35వేలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ దోర నారాయణ, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిని హిమబిందు, వైసిపి నాయకులు రెడ్డి మోహన్ రావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు కావడం వల్ల ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించిందని, అటువంటి ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం తగదని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.పైడిరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 645వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అదానీ, అంబానీలకు చెందిన కార్పొరేట్ సంస్థలకు వెళితే ఎక్కువ మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. రెండేళ్లుగా ఉక్కు ఉద్యమం సాగుతున్నా కేంద్రం దిగి రాకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో కూర్చున్న వారిలో యూనియన్ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, ఎస్.లోకేష్, పి.సురేష్, వై.ఆనంద్, పి.భాస్కర్ ఉన్నారు.

11 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్యాగరాజ ఆరాధన ట్రస్టు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 11 నుంచి 16 వరకూ త్యాగరాజ ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం కళాభారతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. ఈసారి వీలైనంత ఎక్కువ మందిని అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉదయం 7 గంటలకే కార్యక్రమాలు ప్రారంభించి రాత్రి 9 వరకు కొనసాగేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత డీన్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్ హాజరవుతారన్నారు. ఉత్సవాల షెడ్యూల్‌ను తెలిపారు. అనంతరం త్యాగరాజ ఆరాధన ఉత్సవాల పోస్టర్‌ను అకాడమీ అధ్యక్షులు మంతెన సత్యనారాయణ, ట్రస్టీ పైడా కృష్ణ ప్రసాద్, ఎస్.రామగోపాల్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పంతులు గోపాలరావు, మోహనదాస్ ఆవిష్కరించారు.

జిఒ 1 ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజ్యాంగానికి, భావ స్వేచ్ఛకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 1ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద జిఒ 1 కాపీలను ఆ పార్టీ కార్యకర్తలు దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు గొంప గోవిందరాజు, రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్, గుత్తుల శ్రీనివాసరావు, వజ్జిపర్తి శ్రీనివాసరావు, హైదర్ అలీ సింకా పాల్గొన్నారు.